## ముల్లును ముల్లుతో...




ఆలోచన!....ఆలోచన! ఒకటే ఆలోచన!....

కూర్చుంటే ఆలోచన. నిలబడితే ఆలోచన. పడుకొంటే ఆలోచన. ప్రక్కకు దొర్లితే ఆలోచన. లేచి నిలబడితే ఆలోచన. నడుస్తూంటే ఆలోచన!

దీని సిగదరగ!....పుర్రెకు పుట్టెడు ఆలోచనలు!

పుర్రెమీద మొలిచే వెంట్రుకలు లెక్కలేనన్ని. పుర్రెలో లేచే ఆలోచనలు వాటికి మించినన్ని. వెంట్రుకలయినా వెనకనో ముందరనో ముందూ వెనుకగా రాలిపోతాయి ఎప్పుడో ఒకప్పుడు. అయితే ఆలోచనలు మాత్రం ఊరుతూనే వుంటాయి ఎప్పుడూ.

సామాన్యునికి సంసారం సాగరమని ఆలోచన. సంపన్నునికి సంసార సాగరములో పూలతెప్పలపై తేలిపోవడమెలా? అని ఆలోచన. దారిలో ఎదురుపడ్డ అందమైన అమ్మాయి ఎగాదిగా చూస్తూనే ఎగిరి గంతేసి గాఢంగా కౌగలించుకొని ముద్దుతో కాటువేస్తే ఎంత ముద్దుగా వుంటుందో?- ఆశాపూరితమైన ఒకని ఆలోచన! అందమైన పెళ్ళాం ప్రక్కన నడుస్తూంటే అందరూ చూస్తున్నారే!—అని అసూయాస్పదమైన మరొకని ఆలోచన.

కొంపలు కూల్చడానికి ఆలోచన! కొంపలు నిలపడానికీ ఆలోచన! ఒకడి ఆలోచన మరొకడి కొంపను నిట్ట నిలువునా కూల్చింది. అదే నన్ను నిన్నటినుండి ఆలోచనలో పడవేసింది.

ఆలోచన! ఆలోచన!!....ఒకటే ఆలోచన!!!

ఈ ఆలోచనతో నిలబడిన చోట నిలబడలేకపోతున్నాను. కూర్చున్న చోట కుదురుగా కూర్చోలేక పోతున్నాను. నిన్నటినుండి నా మొగం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనవలసి వచ్చిన ముఖ్యమంత్రి మొగం కంటే మూడు రెట్లు ఘోరంగా తయారయింది. అది చూచి ఆ పల్లెలో నా మిత్రుడు అడుగలేక—అడక్కుండా ఉండలేక గుటకలు మింగుతున్నాడు.

అసలు నే నా పల్లెకు వెళ్ళడం ఏ అయిదారేండ్లకో కానీ కుదరదు. అంత కంటే అవసరం కూడా ఉండదు. అవకాశము లేదు. వీధి బడిలో కూర్చుని యిసుకపై ఓనమాలు దిద్దిన నాటి వయసులో నుండి ఆ యిసుకతో నాకు అనుబంధముంది. అక్కడి మట్టితో నాకు సంబంధముంది. రాళ్ళూ రప్పలు నన్ను చూస్తే పలకరిస్తాయని, చెట్లు చేమలు నా చూపుతో పరవశించి ఆనందంతో తల లూపుతాయని, తప్పటడుగు వేసే వయసులో తలదువ్వి చుక్కపెట్టి చక్కగా చంకకెత్తుకొని తిరిగిన వాళ్ళ కళ్ళు నన్ను చూచి ఆనందంతో మెరుస్తాయని - అనుకొనేవాడిని.

అయితే నాలుగు పదుల వయసు దాటిన తరువాత ఆ ఊరిని గురించి ఆలోచించడమే అరుదైపోయింది. ఇప్పుడా ఊళ్ళో చాలా మార్పులు వచ్చాయి. కోతికొమ్మలాట ఆడుకొన్న చెట్లు బొగ్గులకో వంటచెరుకుకో ఆహుతి అయినాయి. ఎక్కి-దూకిన గుండ్రని బండల్ని ముక్కలు ముక్కలుగా పగలగొట్టి ఉన్నవాళ్ళు ఆ రాళ్ళతో యింటి గోడలు కట్టుకొన్నారు. గోరుముద్దలు తినిపిస్తూ చందమామను చూపించిన అమ్మలక్కలు చాల మంది కాలగర్భంలో కలిసిపోయారు. ఇప్పుడు నాకా పల్లెలో ఒకే ఒక మిత్రుడు మిగిలి వున్నాడు. అతడెప్పుడో ఒకసారి మనసులో మెదులుతాడు. అప్పుడు కాలు కదులుతుంది.

నిజానికి చిన్నప్పటినుండి వాడికీ నాకు చుక్కెదురు. అందరు నన్ను కాకపోయినా నా తెలివిని గౌరవించేవాళ్ళు. మరుసటిరోజు తరగతిలో నేను వేయబోయే చెంప దెబ్బల్ని కాస్త మెల్లగా వేయమని వీపునెక్కించుకొని ఉప్పుమోసే వాళ్లు. చిన్న రెండు చక్రాలబండిపై కూర్చోబెట్టుకొని అమిత వేగంగా లాగి నన్నానందపరచేవాళ్ళు. వేరుశనక్కాయలు బెల్లం దొంగతనంగానైనా యిండ్లల్లోనుండి తెచ్చి లంచమిచ్చేవాళ్ళు. అయితే ఈ మిత్రుడు మాత్రం దేనికీ లొంగేవాడు కాడు. మాటమాట్లాడే వాడు కాడు. అదేమి చిత్రమో?—కడకు వాడే నాకా పల్లెలో ఏకైక మిత్రుడుగా మిగిలాడు.

చుట్టూ పచ్చని కొండలు....సుఖాల్లో కష్టాలాగా ఆ కొండలపై పెద్ద పెద్ద బండలు....ఆ కొండచరియలు జారి జారి ఊరివైపు ప్రాకినవా? అన్నట్లుగ పచ్చని పొలాలు....ఊరి ముందర తామరకొలను....ఆ కొలనులో విచ్చి వికసించిన తామరలు....అది చూచి మూతిముడిచిన కలువలు....ఆ పల్లె ఓ అందాల ముల్లె!....

చిన్ననాటి మిత్రుడు అప్పటికప్పుడు చెరకుతోటల నుండి విరుచుకొని వచ్చి యిచ్చిన చెరకు గడలు నములుతూ, వాడే చెట్టెక్కి కోసి

తెచ్చిన ఎలనీరు టెంకాయలు తాగుతూ చిన్ననాటి తలపోతలతో తేలి యాడడమంటే—మహా సరదా. అందుకే ఆ పల్లెకు వెళ్ళాను. ఆ ముందటి రోజు రాత్రి ఊరి నడిబొడ్డులో రాగి మానుకింద రచ్చబండవద్ద పద్దిస్తం అంటే విందామని మిత్రుడితో కలిసి వెళ్ళాను.

ఒక రైతు తన పొలంలో కొంత అమ్మాడు. మరొక రైతు కొన్నాడు. అమ్మిన రైతు తాగుబోతు. కొన్న రైతు బ్రదుక నేర్చిన మేకు! ఈ బేరాన్ని కుదిర్చింది బ్రదుకులతో చెలగాటాలాడే పచ్చల పిడిబాకు— గ్రామ కరణం. బ్రదుక నేర్చిన మేకు, పచ్చలపిడిబాకు గుసగుస లాడు కొన్నాయి. చేతులు కలుపుకొన్నాయి. ఒళ్ళు తెలియని కైపులో తాగుబోతు యిచ్చినంత కుడిచేత్తోనే పుచ్చుకొని ఎడమచేత్తో వేయమన్న చోటంతా వ్రేలి ముద్రలు వేశాడు. పైకం ముట్టినట్లు అంగీకరించాడు. పత్రాలు రిజిస్ట రయ్యాయి.

అమ్మినవాడికి కైపు దిగింది. అమ్మకానికి పెట్టింది తన పొలంలో కొంత భాగమే నన్నాడు. ఆ మాటలు విని కొన్నవాడికి కైపు ఎక్కింది. అంతా తనదే నన్నాడు. పత్రాలు దానికి ఆధారమన్నాడు. వాళ్ళు చెప్పిందే తాను రాశానని అంతకు మించి తనకేం తెలియదని నంగనాచి కబుర్లు పలుకు తున్నాడు గ్రామ కరణం!

“అయ్యో కుయ్యో మొర్రో నా నెత్తిన బండేశార్రో నాయనో” అంటున్నాడు శ్రీపురం చిన్నబ్బ!

శ్రీపురం వాళ్ళ కుటుంబమంటే ఆ పాయ కట్టులో సిరి గల కుటుంబం. శరీరములో ప్రధానమైనవి రెండు నేత్రాలు. ఆ కుటుంబానికి ఆధార స్తంభాలు ఇద్దరన్నదమ్ములు. పెద్దతను నల్లగా వుంటాడు. అతని పేరు నల్లపరెడ్డి. రెండవవాడు ఎర్రగా వుంటాడు. అతని పేరు ఎర్రమ రెడ్డి. తమ్మునిచేతిలో నాలుగ్గాండ్ల సేద్యం నల్లేరు పైబండిలా సాగి

పోతూంటే—అన్న చేతిలో పదివేలు చేతులు మారుతూ ఏటేటా చెప్పుకో దగినంతగా పెరుగుతూనే వుంది. శ్రీపురం వారి గడపలో కాలుబెట్టి కడుపు మంటతో తిరిగి వెళ్ళిన వాడు కాని చేయి చాచి చిన్నబోయిన వాడు కానీ లేడని ప్రతీతి.

ఆ అన్నదమ్ములిద్దరు ఎదు రెదురుగా నిలబడింది అరుదు. రామ లక్ష్మణులని ఆ పాయకట్టు ప్రజలు వాళ్ళకు యిచ్చారు బిరుదు.

వాళ్ళ తరం మారింది!

ఎర్రమరెడ్డికి యేడుమంది, నల్లపరెడ్డికి నలుగురు—వీరాధి వీరులు శూరాధి శూరులైన కొడుకులు. అందుకే కొంప పదకొండు దోవ లయింది.

ఆ పదకొండు దోవల్లో ఒకా నొక దోవను పట్టుకొన్న వీరాధి వీడుడే శ్రీపురం చిన్నబ్బ. తాగడాని కలవాటుపడ్డాడు. చరాస్థితో చలగా టానికి దిగి అది చేయి జారి పోవడంతో స్థిరాస్థి వరకు వచ్చాడు. అది గూడా ఆరుకు మూడుగా తయారయింది. నోటికి, చేతికి తాళం వేస్తున్నాడు.

పాలన్నం తిన్న పదిమంది పెద్దమనుష్యులు రాగి మానుకింద రచ్చ బండమీద కూర్చుని తలకొక్క తీరుగా తర్జన భర్జనలు చేశారు. నడిరేయికి అటు యిటు తెగకపోయేసరికి మరు రాత్రికి వాయిదా వేశారు.

అక్కడ ఆ రచ్చబండమీద అందరితో కలిసి కూర్చుని విన్నాను, ఆ ముందటిరోజు రాత్రి!—ఈ రోజు ఊరి ముందర కొలనుగట్టున ఎవ్వరో పుణ్యాత్ముడు చెట్టు క్రింద అమర్చిన రాతి తిన్నెపై చతికిలబడి ఆలోచిస్తు న్నాను.

గ్రామ కరణం తీరు బ్రదుకనేర్చిన వాడి జోరు ఆలోచిస్తూంటే

నిజంగా శ్రీపురం చిన్నబ్బ మొద్దబ్బగానే కనిపిస్తున్నాడు. ఆతనికి న్యాయం జరగాలి. అయితే నేనేం చేయాలి?—అదే ఆలోచిస్తున్నాను.

పొద్దు క్రుంకింది. ఆలమందలు రేపిన గోధూళితో పడమటి దిశ పోటీ పడుతూ వుంది. చెట్లమీది పిట్టలు....కొలనులో కప్పలు రంపు చేస్తున్నాయి, ఈ అన్యాయం వాటి కర్థమైనట్లు! బంగారుచాయలో బంతుల్లాగ కొలనులో తామరలు, కలువలు గాలి వాటంగా ఊగుతున్నాయి. ఆ అసుర సంధ్యలో శూన్యాన్ని చూస్తూ ఆలోచిస్తున్న నా చూపుల్లో పడింది, ఆ గుంటకట్ట చివరన పూరిపాకలో వెలిసిన గవర్నమెంటు సారాయి అంగడి!....

కొన్ని బడుగువి. కొన్ని గూనివి. కొన్ని ఎండినవి. మరికొన్ని బాగా కండ బట్టినవి. కొన్ని ముసలివి. కొన్ని ముతకవి. ఎన్నెన్ని ఆకారాలు? ఆ పూరిపాక దరిదాపుల్లో నిలబడున్నాయి. అటు యిటు దొంగ చూపులు చూస్తున్నాయి. ఒదిగి ఒదిగి కదులుతున్నాయి, అడుగుమీద అడుగువేస్తూ! అటుపై వున్నట్లుండి చడీ చప్పుడు లేకుండా ఆ పూరిపాకలో దూరుతున్నాయి—పాల కుండను చూచిన పిల్లుల్లాగ!

కాసేపు తరువాత ఆకారాలన్నీ బయటికి నడుస్తున్నాయి. ఇప్పుడా ఆకారాల్లో వొదుగుతనం లేదు. ఆ కళ్ళల్లో పిరికితనం లేదు. ధీమాగా నిలబడుతున్నాయి. ప్రయత్నపూర్వకంగా చుట్టూ కలయచూస్తున్నాయి కైపు కన్నులతో. తమకు తామే సాటి అన్నట్లుగ అంతలోనే మెల్లగా ఊగుతున్నాయి పూనకం పూనినట్లుగ. వాగుతున్నాయి వ_క్తల్లాగ. అటుపై దేని దారి దానిదిగా ఆ ఆకారాలు సాగిపోతున్నాయి ఆనందమే ముందుకు కదిలినట్లుగా!

పొద్దస్తమానమూ రెక్కలు ముక్కలు చేసుకొని గడించిన కూలిని ఒకడు.... యింట్లో చేతికి దొరికిందానిని తెగనమ్మి ఒకడు.... పెళ్ళాం పుస్తెను

మాత్రం మిగిల్చిన ఉదారహృదయుడింకొకడు?—ఇలా ఎంతమంది? వీళ్ళల్లో ఎంతమంది శ్రీపురం చిన్నబ్బ లున్నారో?....

ఇది గాంధీపుట్టినదేశం. ఈ దేశంలో కృతజ్ఞతాభావం హిమాలయా లంత ఎత్తుకు ఎదిగింది. గంగాయమున నదుల్లాగా వరదలు కట్టి ప్రవహిస్తూంది. అందుకే గాంధీమహాత్ముడిని మనం మరచిపోవడంలేదు. ఆయన విగ్రహాలు నాలుగురోడ్ల కూడళ్ళలో నయనాహ్లాదకరంగా ప్రతిష్ఠాపించు కొన్నాము. ఆ బోడి నెత్తిమీద పిట్టలు రెట్ట వేస్తున్నాయి. మనకు పట్టింపు లేదు. నవనాగరికతా జీవిత పరుగుపందెంలో—యిలాంటి చిన్న చిన్న విషయాల్ని పట్టించుకోవడానికి కోరిక వున్నా తీరి కెక్కడిది? ఆ మహాత్ముని పేరు వీధులకు తగిలించుకొన్నాము. గాంధీరోడ్లలోనే అందంగా బ్రాందీ అంగళ్ళు పెట్టుకొన్నాము. ఆయన వద్దన్న మగువ మదిర అంటే మనకు మహా ముద్దు. ఈ రెండింటిని ఎరగాచూపిస్తే ఎదురేలేదు. కొండమీది కోతిని దిగిరమ్మంటే వస్తుంది.

ఉన్నవాళ్ళు తాగనీ! తలకు పోసుకోనీ!!—ఆలోచించనవసరం లేదు. కానీ ఆలోచించవలసింది చెమటను చిల్లర డబ్బులకింద మార్చుకొనే మానవుల్ని గురించి. అలాంటి మానవుడు వాటిని గురించి వాడు ఆలోచించుకోలేడు. అలా ఆలోచించగలిగితే వాడూ ఉన్నవాడు కాగలడు ఏ నాటికో ఒకనాటికి. అందుకే మనం ఎప్పుడూ వాడు ఆలోచించుకోడానికి ఆస్కారం కలిగించకూడదు. ఆస్కారం కలిగిస్తే వాడు అన్యాయంగా మన చేతినుండి జారిపోతాడు. పోగొట్టుకొన్నవాడిని పొందటమంటే మాటలు గాదు. అందుకే యిలాంటి కూలి బతుకులకు సాధ్యమైనన్ని సమస్యల్ని సృష్టించాలి. చెడిపోవడానికి వలసినంత ఎరచూపాలి. లేకుంటే—గాంధీ పుట్టిన ఈ దేశంలో చెమట జీవుల రక్తాన్ని చెరిపే యిన్ని సారాయి అంగళ్ళా?

కొలనులో గాలి వాటంగా వేస్తున్న అలల్లా ఆలోచనలు. ఈ ఆలోచ

నలతోనే కడుపు నిండిపోయింది. దీనికి తోడు సాయంకాలంపూట తాగిన ఎలనీరు.... చెరకురసం. ఆకలి చచ్చిపోయింది. గుడ్డివాడు దారిమీద పడ్డట్టు సాగుతున్న ఆలోచనలతో ఎంతకాలం గడిచిందో తెలియనేలేదు. తీరా తేరు కొని తేరిపారచూసేసరికి దాదాపు జామురాత్రి కావస్తూ వుంది.

గుంటలో కప్పలు అరుస్తున్నాయి. దూరంగా గుంటనక్కలెక్కడో ఊళలేస్తున్నాయి. ఊళ్ళో రచ్చబండమీద వాదోపవాదాలు గట్టి గట్టిగా వినిపిస్తున్నాయి. నిన్నటిరాత్రి అటు యిటూ తేలని మద్దిస్తం మళ్ళీ ప్రారంభమైనట్లుంది. కొత్తనీరు పాతనీటిని తరిమినట్లుగా చెమట జీవులందరు శ్రీపురం చిన్నబ్బను వెనక్కునెట్టారు. రచ్చబండ వాదోపవాదాలు చెవిన పడేసరికి శ్రీపురం చిన్నబ్బ మనసులో మెదిలాడు. ఆతనికి న్యాయం జరగాలన్నది నా కోరిక. అందుకే వడి వడిగా గుంటకట్ట దిగి రచ్చబండను చేరుకొన్నాను. అక్కడ వాదోపవాదాలు తలాతోక లేకుండా తలకొక్క తీరుగా సాగుతున్నాయి.

"అదిగాదన్నా! మీరు జెప్పేది బలే బాగుండాదే!....తాగి తలకు బోసుకుంటే మాత్రం అంత వళ్లు తెలియకుండాపోతిందా?....సాచ్చులుండ్రి. రిజిస్టారాపీసుండె. ఇంతమందిని కాదని రత్నం మాత్రం ఎట్లా రాసేస్తాడు?" ఓ ఆవు నోటాయన అరుస్తున్నాడు.

"ఇదో! మా యబ్బతోడు. మాకేఁవీ తెల్దు. వాళ్ళు పిలిసిరి. పోతిఁవి. బస్సెక్కమనిరి. ఎక్కితివి. పాకాల్లో దిగమనిరి. దిగితిఁవి. ఒకపూట పూట కూళ్ళింటిలో కూడు బెట్టించిరి. తింటిఁవి. అమిందట్నే నన్ను శ్రావాలు సెయ్యిమనిరి. వాణ్ని సెయ్యిగుర్తు ఎయ్యమనిరి. ఇంత జేసినాక పెట్టమంటే పెట్టకపోతే ఎట్లాని, పెట్టేస్తిఁవి. అంతేకానీ మా యబ్బతోడు యీడేఁవమ్మినాడో! ఎంత కమ్మినాడో? మాకు తెల్నే తెల్దు. కడుపుకు కూడుతినే మణుసులు. యింతన్నాయానికి లోబడ్తారని మాకు మాత్రం ఏఁవి తెలుసు?"

సాక్షులుగా సంతకం బెట్టమంటే ఒకడు సంతకం వేరొకడు వేలిముద్ర వేసిన తీరు వివరిస్తున్నారు సాక్షులు.

"ముత్తేలమ్మ సాచ్చిగా సెప్తావుండా! నా కుండేది రొండెకరాల మడి. ఆ రొండెకరాల్లో ఒకెకరం అమ్మేసి యింకొకెకరం పెట్టుకుణ్ణా! ఈళ్ళేమో రొండెకరాలమ్మేసినట్లు రాసుకుణ్ణారు. నే నెట్టబతికేదిరా నాయినోయ్" అని నెత్తిన నోరుబెట్టి మొత్తుకుంటున్నాడు శ్రీపురం చిన్నబ్బ అనబడే మొద్దబ్బ.

గ్రామకరణం ఉలక్కుండా పలక్కుండా వున్నాడు. మంచీ చెడులను రచ్చబండ మీదికి తోలి యేం జరుగుతుందో చూద్దామని ఎదురుచూస్తూ కుదురుగా కూర్చున్నాడు కొన్న ఆసామి. ఎవరికి తోచినట్లు వాళ్ళు మాటాడుతున్నారే కానీ తేల్చి చెప్పలేకపోతున్నారు. ఇంతలో గ్రామ పినపెద్ద శీపాటి బసిరెడ్డి గొంతు సవరించుకొన్నాడు. అందరూ ఆయనవైపు తిరిగి చెవులు దగ్గర పెట్టుకొన్నారు.

శీపాటి బసిరెడ్డి చాలా నిఖార్సయిన మనిషి. ధర్మ గోవు ఆయన దొడ్లోనే పుట్టి పెరిగిందని ఆయన వెంట నాలుక్కాళ్ళమీద నడుస్తుందని ఆ పల్లీయులు నమ్ముతారు. కోర్టుకెక్కిన కొంపలు కొళ్ళబోతాయని బసిరెడ్డి నమ్మకము. అందుకనే ఓపిగ్గా రచ్చబండమీద కూర్చుంటాడు. ఆయన రచ్చబండమీద కూర్చుంటే ఆ ఊళ్ళో తలనెరసినతనం మీసాలు మెలివేసే వయసు ప్రక్కన కూర్చుంటుంది. వాదోపవాదాలకు దిగుతుంది. తెలివితేటల్ని ప్రదర్శించుకోవడానికి వాదానికి దిగినట్లుగ దిగి జుట్లపందెం వరకు ఎదుగుతుంది. అప్పుడు శ్రీపాటి బసిరెడ్డి కల్పించుకొంటాడు. ఆయన నోరు తెరవడంతో అందరినోళ్ళు మూతపడతాయి. చెవులు మాత్రం జాగ్రత్తపడతాయి. ఆ పల్లెవాసులకు చదువు సంస్కారం లేకపోవచ్చు. తెలివితేటలు అంతంత మాత్రంగా వుండవచ్చు. అయితే అనుకొంటే ఆరునూరయినా ఆ పద్ధతికి కట్టుబడతారు. అది వాళ్ళలోని విశిష్టత. మనుష్యల్లో ఆ విశిష్టత వుంది

కాబట్టే రాగిమానికింద రచ్చబండ విశిష్టతనాపాదించుకొనింది. ఏండ్లుపూండ్లుగా ఎన్నో సమస్యలక్కడ ఓ ముగింపుకు వచ్చాయి.

నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తూ సమస్యల్ని స్వార్థంకోసం సృష్టిస్తూ సతమతమయ్యే పట్టణ వాతావరణంనుండి వచ్చిన నేను— ఆ పల్లీయుల క్రమశిక్షణకు ముగ్ధుడినయ్యాను. శీపాటి బసిరెడ్డి అందుకొన్నాడు.

"శీపరం వాడేఁవో అమ్మింది ఒక ఎకరఁవే అంటావుంటాడు. పుల్లూరో డేఁవో కొనేసింది-రొండెకరాలంటున్నాడు. ఇచ్చిన దుడ్డు దగ్గిర యిద్దరి మాటా ఒకటిగానే వుంది. తాగిన ఎదవ కాబట్టే శీపరఁవోడు యింత సలీసుగా రొండెకరాలు అమ్మేసి వుంటాడు. పుల్లూరోడు కొనేసి వుంటాడు."

"ఔనౌను. ఆ మాటే మనఁకు తోసలా! రొండెకరాలు యింత సవగ్గా యాఁవారించే కొట్టేసుండాల!" ముక్తకంఠంతో పలికింది రచ్చబండ.

"అన్నాయం! అన్నాయం!!" అన్నాడు పుల్లూరు పెద్దబ్బ.

"నాయాలు నన్నట్లానే యావారించె" అన్నాడు శ్రీపురం చిన్నబ్బ.

శీపాటి బసిరెడ్డి మధ్యలో అందుకొన్నాడు.

"యాఁవారించినా, యాఁవారించక పోయినా పుల్లూరోడికి పత్రాలుండాయి. కోరట్టుకెక్కినా వాడి మాటే గెలుస్తుంది. అట్లాగని వదిలేస్తే శీపరఁవోడు తూరుపుగాలికి కొట్టుకొని పోతాడు. అందుకే నాకొక ఆలోచన తట్టావుంది."

అందరూ చెవులు రిక్కించి బసిరెడ్డివైపు చూస్తున్నారు. నాకుకూడా ఆతురతగానే వుంది - ఆ ధర్మగోవు తీర్పు విందామని!

"తాగినోడిదగ్గిర యింత సవగ్గా రొండెకరాలు రాయించుకోవడం

పుల్లూరోడి తప్పు. ఊళ్ళో పెద్దా సిన్నా యింత మందుండగా ఎవ్వరితోగూడా సెప్పకుండా సెందకుండా తాగేసి రాసిచ్చింది శీపర్వోడి తప్పు.”

ఔనౌనంటూ ఆమోదముద్ర వేసింది రచ్చబండ.

“అందుకే పుల్లూరోడు చేసిన తప్పుకు తాను రాయించుకున్న రొండెకరాల మడిలో వొకెకరం వాడికి మల్లా రాసిచ్చెయ్యాల. శాపరవోడు చేసిన తప్పుకు అరెకరా సేను పుల్లూరోడికి రాసియ్యాల.”

తీర్పునిచ్చాడు శీపాటి బసిరెడ్డి. ఆ తీర్పుతో రెక్కలు తట్టింది, రచ్చబండ!—ఎవరిదారి వారిదిగా రచ్చబండ ఖాళీ అయింది.

ఆ తీర్పు చాలా సమంజసంగా తోచింది. ఇద్దరి తప్పుకు అంతో యింతో ప్రాయశ్చిత్తం జరిగింది. అయితే అమాయకుడైన శ్రీపురం చిన్నబ్బకు న్యాయం జరగాలన్నది నా కోరిక. అదే వెలిబుచ్చాను నా మిత్రుడితో.

“శీపర్వోడి కుండేది రొండెకరాల పల్లవే అయితే మెట్టమాత్రం అయిదారెకరాలుంటుంది. అదాలోచించే బసిరెడ్డిబావ తీర్పుసెప్పింది. నా మట్టుకు నాకు యిది న్యాయంగానే వుంది” అన్నాడు నా మిత్రుడు.

“ఇది అన్యాయమని నేనుకూడా అనడంలేదు. అనుభవశాలి శీపాటి బసిరెడ్డి చక్కని తీర్పే యిచ్చాడు. అయితే ఇక్కడ జరిగింది మోసమని అందరికీ తెలుసు. పత్రాలు రిజిస్టరయ్యాయి కాబట్టే యెవరేమీ నోరు తెరవ లేకపోతున్నారు. అందుకే నేననేది—ముల్లును ముల్లుతోనే తీయాలని! నువ్వు సహకరిస్తే ఆ పని చేద్దాం. అమాయకుడికి న్యాయం జరగడానికి నే నిక్కడ వారంరోజులైనా మకాం వేస్తాను” అన్నాను మిత్రుడితో.

‘అదెలా?’ అన్నట్లుగా అతడు ఆశ్చర్యంగా నా వైపు చూశాడు.

‘అదంతే’ అన్నట్లుగా అతనివైపు చూస్తూ చిరునవ్వు నవ్వాను.

ఆ నిశ్శబ్ద నిశీథిలో రచ్చబండకు దరిదాపుల్లో వాడి ఎదురుగా నేను,

నా ఎదురుగా వాడు నిలబడ్డాం. అడుగు అటు యిటు కదల్చకుండా అరగంట సేపు మాట్లాడుకొన్నాం. ఓ నిర్ణయానికి వచ్చాం. అయితే మా నిర్ణయాన్ని మా వరకే పరిమితం చేసుకొన్నాం!....

*                    *                    *

దొల్లు దొల్లు పుచ్చకాయలా దొరలిపోతున్న ఈ కాలగమనంలో వారం తిరగడమెంతసేపు? ఈ వారం లోపుగా పుల్లూరు పెద్దబ్బ శ్రీపురం చిన్నబ్బ శీపాటి బసిరెడ్డి యిచ్చిన తీర్పు మేరకు పాకాలకు వెళ్ళారు.

పుల్లూరు పెద్దబ్బ తాను మోసంచేసి రాయించుకొన్న ఎకరా పల్లపు భూమిని మళ్ళీ శ్రీపురం చిన్నబ్బకు రిజిస్టర్ చేసి యిచ్చాడు. శ్రీపురం చిన్నబ్బ అరెకరా మెట్టనేలను తన తప్పుకు పరిహారంగా పుల్లూరు పెద్దబ్బకు రిజిస్టర్ చేసి యిచ్చాడు. నేను మాత్రం ఇదేమీ పట్టించుకోనట్లుగా వేళకంత తిని యిష్టమొచ్చినట్లు తిరుగుతున్నాను. నా మిత్రుడు మాత్రం ఈ తతంగమంతా నెత్తిన మోసినట్లు తిరిగాడు.

ఆ రోజు ఉదయం నుండి బాగా ఉమ్మిగిస్తూ వుంది. ఎవరి నోట విన్నా ఈ పూట నాలుగు చినుకులు రాలేటట్లుగా వుందని వినపడుతూ వుంది. అనుకొన్నట్లుగానే ఆ సాయంకాలానికి పదును చినుకులకు పైబడి పడ్డాయి.

ఆ మరుసటి రోజు ఫల్లుమని తెల్లవారేసరికి మెట్టచేనుల్లో మడకలు తిరుగుతున్నాయి. శ్రీపురం చిన్నబ్బ పుల్లూరు పెద్దబ్బకు రాసిచ్చిన అరెకరా చేని దగ్గర పుల్లూరు పెద్దబ్బ, నా మిత్రుడు 'నేనుమడక కట్టాలంటే నేనని' వాదోప వాదాలకు దిగి ఆపై సిగపట్లవరకు ఎదిగారు. ఎక్కడ పరిస్థితి సిగపట్లవరకు ఎదుగుతుందో అక్కడ శీపాటి బసిరెడ్డి వాలడం ఆ పల్లెలో పరిపాటి. ఆయన వద్దన్నా ఆయన వెంట పదిమంది ఉంటారు.

"సూడన్నా ఈ అన్నాయం. శీపరంవోడు నాకు రాసిచ్చిన సేను ఈడు

నాదంటా వుంటాడు. నువ్వే గదా పద్దిస్తం చేసింది. నువ్వే సెప్పు ఇది నాయం వేనా?"—రొప్పుతూ రోజుతూ శీపాటి బసిరెడ్డి కంటపడడంతో మొర పెట్టుకున్నాడు పుల్లూరు పెద్దబ్బ.

శీపాటి బసిరెడ్డి అదోరకంగా చూశాడు నా మిత్రుడివైపు.

"అదిగాదు బావా! ముందు పత్రాలు చెల్లతాయా! వెనక పత్రాలు చెల్లతాయా నువ్వే చెప్పు. శనివారం నాడు శీపరంవోడు ఈడికి రిజిస్టర్ చెయ్యిస్తే, నాకు సోమవారం నాడే రిజిస్టర్ చేసిచ్చె. అందుకే నా చేవిలో నేను మడక కట్టాలంటావుండా."

అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు శీపాటి బసిరెడ్డి. నేనందుకొన్నాను.

"బసిరెడ్డిగారూ! పుల్లూరు పెద్దబ్బ కరణం కలిసి శ్రీపురం చిన్నబ్బను తాగించి మోసం చేశారన్న సంగతి అందరికీ తెలుసు. అయితే పత్రాలు రిజిస్టర్ అయిపోయినందున ఎవరేమీ చేయలేని పరిస్థితిలో మీరు మంచి తీర్పునే యిచ్చారు. అయితే తాగిన నేరానికి శ్రీపురం చిన్నబ్బ ఇంత నష్ట పడడం నా కిష్టం లేకపోయింది. అందుకే మీరు తీర్పు ఇచ్చిన మరుసటి రోజు చిత్తూరికి వెళ్ళి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో ఈ అరెకరా మనవాడి పేరిటికి రిజిస్టర్ చేయించాను. ఇప్పుడే కోర్టుకు వెళ్ళినా పుల్లూరు పెద్దబ్బ పప్పులేమీ వుడకవు. మళ్ళీ ఒకసారి పాకాలకు పోయివస్తే శ్రీపురం చిన్నబ్బ చేను శ్రీపురం చిన్నబ్బదవుతుంది!"—

వాళ్ళ సందేహాన్ని నివృత్తి చేశాను!

"సెబాస్! మంచిపనిచేశావు నాయినా?" అని శీపాటి బసిరెడ్డి నా భుజం తట్టాడు.

"ఏం చేద్దామండి! ఈ రోజుల్లో ముల్లును ముల్లుతోనే తీయాలి" అన్నాను.

"ముల్లును ముల్లుతోగాదు నాయినా వాడేలితో వాడి కన్నే పొడిసినావు!" అన్నాడు నవ్వుతూ బసిరెడ్డి.

శ్రీపురం చిన్నబ్బ గంతులు వేస్తున్నాడు తాగినవాడిలా!—పడక విప్పి భుజాన పెట్టుకొని తన కోపాన్నంతా ఎద్దులమీద చూపిస్తున్నాడు పుల్లూరు పెద్దబ్బ!

అమాయకుడికి జరిగిన అన్యాయం—న్యాయంగా పరిణమించేసరికి ఆ పల్లెపట్టు ఫక్కున నవ్వింది.

1980, ఆంధ్రభూమి మాసపత్రిక